Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143


Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 92 | SUNDAY 09.03.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి : 6 | సంచిక : 92 | ఆదివారం 09. 03. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

మార్కాపురంను...

## జిల్లా చేస్తాం



మీ గౌరవాన్ని మరింత పెంచుతా..

మార్కాపురంలో చంద్రబాబు పర్యటన

మహిళా దినోత్సవ కార్యక్రమాలకు హాజరు

అనంతరం స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం

ప్రకాశం, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ సీఎం చంద్రబాబు ఇవాళ మార్కాపురంలో పర్యటించారు. మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. మార్కాపురం జిల్లా చేస్తామని వెల్లడించారు. మార్కాపురంను జిల్లా చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్లు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నంద్యాలను జిల్లాగా చేసినా, మార్కాపురంను ప్రకాశం జిల్లాలోనే ఉంచారు. ఇవాళ చంద్రబాబు కొత్త జిల్లాపై స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇక పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. త్వరలోనే పార్టీ పదవులు భర్తీ చేస్తామని, కష్టపడిన వారికే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు నాయకుల పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నానని చంద్రబాబు వెల్లడించారు. అన్ని ఎన్నికల్లో మనం గెలిస్తే కార్యకర్తలకు గౌరవం పెరుగుతుందని అన్నారు. ప్రతి ఎన్నికలోనూ గెలవడం ద్వారా రాష్ట్రంలో సుస్థిరపాలన వస్తుందని చెప్పారు. కార్యకర్తల శరీరంలోని ప్రతి రక్తపు బొట్టూ పసుపు రంగేనని చంద్రబాబు ఉద్ఘాటించారు. నాయకులు వెళ్లిపోవచ్చేమో కానీ కార్యకర్తలు ఒక్క అడుగు కూడా అటూ ఇటూ వేయరని అన్నారు. కార్యకర్తల రుణం ఎలా తీర్చుకోవాలనే దానిపైనే ఆలోచిస్తున్నామని చెప్పారు. కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు చెప్పినా నిర్వహించడంలేదని చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆన్ లైన్ లో మీటింగులు జరిపినా... కార్యకర్తలతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహిస్తేనే ఆప్యాయత కనిపిస్తుందని మిగతా 2 లో

జగన్ ప్రభుత్వం ఖజానా...

## ఖాళీ చేసింది..

: మంత్రి నారాయణ విసుర్లు



కాకినాడ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తుందని మంత్రి నారాయణ తెలిపారు. కాకినాడలో మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి నారాయణ పాల్గొన్నారు. మహిళలను ఆర్థికంగా పైకి తీసుకురావాలనే పట్టుదలతో సీఎం చంద్రబాబు ఉన్నారని అన్నారు. ఎన్నికల హామీల్లో మహిళల కోసం చాలా పథకాలు పొందుపరిచామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిపోయిందని విమర్శలు చేశారు.మున్సిపాలిటీల్లో బ్లీచింగ్‌కు కూడా డబ్బులు లేకుండా చేశారని మిగతా 2 లో

తెలంగాణ ప్రయోజనాల కోసం అందరం...

## ఏకం కావాలి

: భట్టి విక్రమార్క



హైదరాబాద్, బాధ్యత న్యూస్ :: తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరం ఏకం కావాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి మన సమస్యలను వివరించాలని ఆయన అన్నారు. ఉన్నత భావాలతో ఎంపీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్రం నుండి రావాల్సిన నిధుల కోసం పోరాడాల్సి ఉందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మిగతా 2 లో

పదేళ్లలో మహిళల భద్రతకు...

## ప్రాధాన్యతనిచ్చాం...

క్రూరమైన నేరాల్లో మరణశిక్షను విధించేలా చట్టాలను సవరించామన్న మోదీ

మహిళల నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్న ప్రధాన మంత్రి

మహిళలు గ్రామీణ ప్రాంతాల ఆత్మగా అభివర్ణించిన నరేంద్ర మోదీ



అమరావతి,**చిత్తూరు ఎక్స్‌ప్రెస్** :తమ ప్రభుత్వం మహిళల భద్రతకు ప్రాధాన్యతను ఇచ్చిందని, అందుకే అత్యాచారం వంటి క్రూరమైన నేరాల్లో మరణ మిగతా 2 లో

మహిళా దినోత్సవం ప్రతిరోజూ...

## జరుపుకోవాలి

తగ్గేదేలే.. ఇండియా టుడే కాంక్లేవ్‌లో మంత్రి లోకేష్ కీలక వ్యాఖ్యలు..

ఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** మనమిత్ర పథకం ద్వారా వాట్సాప్ సేవలను ఏపీలో అందుబాటులోకి తీసుకువచ్చామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్ తెలిపారు. కుల ధ్రువపత్రాలు, హాల్ టికెట్లు, ఇతర పత్రాలు,ల్యాండ్ రికార్డులన ఈజీగా వాట్సాప్ సేవలో పొందవచ్చని అన్నారు. (శనివారం ఢిల్లీలో ఇండియా టుడే కాంక్లేవ్‌లో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడు దేశ ప్రగతిలో దోహదపడుతుందని మిగతా 2 లో





మహిళలు అత్యవసర పరిస్థితిలో 181 టోల్ ఫ్రీ సేవలు...

## వినియోగించుకోవాలి

ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో మహిళా దినోత్సవ వేడుకలు

హాజరైన మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏలూరులో సీఆర్ఆర్ కాలేజీలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలకు ఏపీ పౌర సరఫరాలు, ఆహార శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఉన్న నాదెండ్ల మనోహర్ జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా దినోత్సవ వేడుకలు ప్రారంభించారు. మహిళల ఆర్థికాభివృద్ధి, భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలు అత్యవసర పరిస్థితిలో 181 టోల్ ఫ్రీ సేవలు మిగతా 2 లో

మహిళా సాధికారత పేరుతో...

## మోసగిస్తున్నారు

విజయవాడ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శలు చేశారు. మహిళలు అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మిగతా 2 లో



# సంపాదకీయం

## భారత్ ఆధీనంలోకి పీఓకే !

పాకిస్తాన్ ఇప్పుడో సమస్యల పుట్ట. ప్రజలకు మూడు పూటలా తిండి పెట్టే పరిస్థితి లేదు. కనీస అవసరాలు తీర్చే అవకాశాలు లేవు. ఇది సరిపోదన్నట్టుగా పాలు పోసి పెంచిన ఉగ్రవాదం ఆ దేశంపైనే తిరగబడుతున్న పరిస్థితి. అది కూడా సరిపోదన్నట్టుగా అణచివేస్తున్నారంటూ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. మరే దేశానికైనా ఇన్ని సమస్యలుంటే పరిష్కారాల కోసం పాలకులు పని చేస్తారు. ఎలాగోలా ఆ కష్టాల నుంచి దేశాన్ని బటయపడేస్తారు. కానీ, పాకిస్తాన్ పాలకులకు మాత్రం దేశంలో ఎన్ని సమస్యలు ఉన్నా వాటన్నింటికీ ఒక్కటే సొల్యూషన్. అదే కశ్మీర్.! రాజకీయంగా పబ్బం గడుపుకోడానికి కశ్మీర్ అంశం వారికో అక్షయ పాత్రలా మారింది. ఇప్పుడు కూడా అదే చేసి ఇండియాతో చీవాట్లు తింది. మరో వైపు క్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు అప్పగిస్తే కశ్మీర్ సమస్యకు తుది పరిష్కారం లభిస్తుందన్నారు విదేశాంగశాఖ మంత్రి జైశంకర్. లండన్ పర్యటనలో ఖలిస్తాన్ వేర్పాటువాదులు ఆయన కాన్వాయ్‌పై దాడికి ప్రయత్నించడంపై విదేశాంగశాఖ మండిపడింది. తమ దేశంలో ఇలాంటి అరాచకాలు సహించేది లేదని ఖలిస్తాన్ వేర్పాటువాదులను బ్రిటన్ ప్రభుత్వం హెచ్చరించింది. లండన్ పర్యటనలో ఒకేసారి అటు ఖలిస్తాన్ వేర్పాటువాదులు , ఇటు కశ్మీర్ వేర్పాటువాదులకు ధీటైన సమాధానం ఇచ్చారు విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ . కశ్మీర్ సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందని ప్రశ్నించిన పాక్ జర్నలిస్ట్‌కు దిమ్మతిరిగే సమాధానం ఇచ్చారు. భారత్ నుంచి దొంగిలించిన కశ్మీర్ భూభాగాన్ని తిరిగి ఇచ్చినప్పుడే ఈ సమస్యకు తుది పరిష్కారం లభిస్తుందన్నారు.ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్ముకశ్మీర్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు జైశంకర్. అంతేకాకుండా అక్కడ అసెంబ్లీ ఎన్నికలను కూడా విజయవంతంగా ముగించినట్టు చెప్పారు. కశ్మీర్ ప్రజలకు ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయాన్ని అందించినట్టు ప్రకటించారు. జైశంకర్ పర్యటన సందర్భంగా లండన్‌లో ఖలిస్తాన్ వేర్పాటువాదులు మళ్లీ రెచ్చిపోయారు. జైశంకర్ కాన్వాయ్‌పై దాడికి ప్రయత్నించారు. జైశంకర్ కారు ముందు భారత త్రివర్ణ పతాకాన్ని అవమానించారు. ఈ ఘటనపై విదేశాంగశాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది . భద్రతా లోపాలు బయటపడ్డాయిని , అరాచకశక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసంది.లండన్ లోని ఛాథమ్ హౌస్‌లో అధికారిక సమావేశాలు ముగించుకున్న జైశంకర్ బయటకు వచ్చారు. అదే సమయంలో ఖలిస్థానీ వాదులు అక్కడ ఆందోళన చేపట్టారు. ఖలిస్తాన్ జెండాలతో నిరసన తెలిపారు. ఓ దుండగుడు విదేశాంగ మంత్రి కారు వద్దకు దూసుకొచ్చాడు. అతడి చేతిలో భారత జాతీయ జెండా ఉండగా దాన్ని అవమానించేలా ప్రవర్తిస్తూ నినాదాలు చేశాడు. అప్రమత్తమైన లండన్ పోలీసులు వెంటనే అతడిని పట్టుకున్నారు. ఖలిస్తాన్ అనుకూల వాదులను లండన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రిటన్ విదేశాంగశాఖ కూడా ఈ వ్యవహారంపై స్పందించింది. శాంతియుత నిరసనలకు మాత్రమే తమ దేశం అనుమతిస్తుందని , హింసకు పాల్పడితే సహించేది లేదని ఖలిస్తాన్ వాదులను బ్రిటన్ ప్రభుత్వం హెచ్చరించిందిపాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీలో కీలక చర్చ జరుగుతోంది. అప్పుడే ఆ దేశ మంత్రి ఇంజనీర్ అమీర్ ముకమ్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానం సారాంశం మన కశ్మీర్‌లో ప్రజల హక్కుల కోసం పాక్ నైతిక, రాజకీయ, దౌత్యపరమైన మద్దతు ఇస్తుందని చెప్పడం. అంతేకాదు, కశ్మీర్‌లో ప్రజలు ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకునేందుకు వీలుగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను భారత్ అమలు చేయాలనీ.. కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణకు అనుమతించాలని తీర్మానం చేశారు. ఆ తీర్మానా న్ని ఆ దేశ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది కూడా. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే ఆ తీర్మానాన్ని అక్కడి విపక్షాలు బాయ్‌కాట్ చేశాయి. ఇదే సమయంలో ఐక్యరాజ్యసమితిలో చర్చ సందర్భంగా పాకిస్తాన్ తీరుపై భారత ప్రతినిధి నిప్పులు చెరిగారు. గతేడాదే కశ్మీర్‌లో ప్రభుత్వాన్ని ఎన్నుకోడానికి ప్రజలు పెద్ద ఎత్తున ఓట్లు వేశారనీ, కొత్తగా ఓటింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదన్నారు. కశ్మీర్‌పై పనికి మాలిన ఆరోపణలు మానేసి పాకిస్తాన్ తన అంతర్గత సమస్యలపై ఫోకస్ పెట్టాలని గడ్డి పెట్టారు.కశ్మీర్‌పై పాకిస్తాన్ తీర్మానం విషయానికి వస్తే.. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను భారత్ అమలు చేయాలనేది దాని అసలు పాయింట్. కాని, అందులో అసలు పాయింటే లేదు. ఒక్కసారి చరిత్రలోకి వెళితే ఆ క్లారిటీ పాకిస్తాన్‌కు వస్తుంది. కశ్మీర్ ఒకప్పుడు స్వతంత్ర సంస్థానం. 1947లో బ్రిటిష్ పాలన ముగిశాక సంస్థానాలపై సర్వాధికారాలు వాటి ప్రభువుల చేతికి వచ్చాయి. భారత్, పాకిస్తాన్ విభజన జరిగిన తర్వాత పూర్వపు సంస్థానాల్లో ఏది ఎటు చేరాలన్న ప్రశ్న వచ్చింది. తమ సంస్థానం భారత్, పాక్ రెండింట్లో ఏ దేశంలో కలిసేదీ నిర్ణయించే అధికారం ఇండియన్ ఇండిపెండెన్స్ యాక్టు సంస్థానాధీశులకి ఇచ్చింది. ఆ ప్రకారం జమ్మూ కశ్మీర్ మహారాజు హరిసింగ్ నిర్ణయం చేసేలోపే పాకిస్తాన్ దుర్మార్గంగా దండెత్తించింది. జనావాసాలను కబళిస్తూ పాక్ సైన్యం శ్రీనగర్ దరిదాపులకు వచ్చేసింది. ఆ దశలో కశ్మీర్ మహారాజు హరిసింగ్ తన రాజ్యాన్ని భారత్‌లో చట్టబద్ధంగా, యథావిధిగా విలీనం చేశారు. జమ్మూకశ్మీర్ ఎప్పుడైతే భారత్‌లో విలీనమైందో, దాని ప్రాదేశిక సమగ్రతను రక్షించటం భారత ప్రభుత్వ బాధ్యతైంది. ఆ వెంటనే కశ్మీర్‌లోకి దూసుకొస్తున్న పాక్ సైన్యాన్ని అడ్డుకునేందుకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రంగంలోకి దిగింది.పాకిస్తాన్ ఆక్రమించుకున్న ఒక్కో ప్రాంతాన్నీ సాధించుకుంటూ ఆర్మీ ముందుకు కదిలింది. మరికొన్ని రోజులు అదే పోరాటం జరిగితే ప్రస్తుతం పీవోకేగా చెబుతున్న ప్రాంతం అప్పుడే ఇండియాలో అంతర్భాగమై ఉండేది. కానీ, అలా జరగలేదు. ఆర్మీ జనరల్స్ వద్దన్నా వినకుండా సైనిక చర్యలను అర్ధాంతరంగా ఆపించేశారు నెహ్రూ. పాక్‌పై ఫిర్యాదు చేస్తూ ఐక్యరాజ్యసమితి గడప తొక్కారు. మహారాజు సంతకంతో ఖరారైపోయిన విలీనాన్ని స్వయంగా తానే తిరగదోడారు. ప్రజాభిప్రాయ సేకరణ జరగాలంటూ దేశంలో మరే సంస్థానానికీ పెట్టని షరతు జమ్మూ కశ్మీర్ విషయంలో ఎవరూ అడక్కుండానే చొప్పించారు. ఆక్రమించిన ప్రాంతాలనుంచి పాకిస్తాన్ వైదొలిగాక ప్లెబిసైట్ జరిపించడానికి ఐక్యరాజ్యసమితి సైతం ఓకే చెప్పింది. అయితే, ఆ ప్రకారం వైదొలగడానికి పాకిస్తాన్ నిరాకరించింది. ఇలా మన కశ్మీర్ పాకిస్తాన్‌లో అంతర్భాగమై పడరానిపాట్లు పడుతోంది. ఇది ఎవరూ చెరిపేయలేని నిజం.నిజానికి.. మెజారిటీ ప్రజలు తమను భారత్‌లో విలీనం చేయాల్సిందిగా ఓటు వేస్తే పీవోకే భారత్‌లో కలిసి తీరాల్సిందే. అందుకు, సంబంధించిన రిజల్యూషన్ 1948లోనే ఆమోదం పొందింది. 1948లో అప్పటి ప్రధాని నెహ్రూ కశ్మీర్ సమస్యని ఐక్యరాజ్యసమితికి నివేదించడం వలన యూఎన్ ఈ రిజల్యూషన్‌ను అమోదించింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో రెఫరెండం నిర్వహించి, ఓటింగ్ ఆధారంగా అక్కడి ప్రజలు ఎటు వైపు ఉండాలో నిర్ణయించు కుంటారనీ, దాని ప్రకారమే పీవోకే భవిష్యత్ నిర్ణయం జరుగుతుందనేది తీర్మానం సారాంశం. పీవోకేలో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన తర్వాత భారత్ అధీనంలో ఉన్న కశ్మీర్ ప్రాంతంలో రెఫరెండం నిర్వహించాలని పేర్కొంది ఐక్యరాజ్యసమితి. కానీ అప్పట్లో రెఫరెండం నిర్వహించడానికి పాకిస్తాన్ నిరాకరించింది. ఐక్యరాజ్యసమితి జస్ట్ భారత కశ్మీర్‌లో మాత్రమే రెఫరెండం నిర్వహించాలని తీర్మానం చేసిందనీ, పీవోకేలో కాదని వాదించింది. వాస్తవం ఏంటంటే.. మొదట పాకిస్తాన్ తన అధీనంలో ఉన్న కశ్మీర్, గిల్గిట్ బాల్టిస్టాన్‌లలో రెఫరెండం నిర్వహించాలి. అది కూడా ఐక్యరాజ్యసమితి పరిశీలక బృందం పర్యవేక్షణలోనే జరగాలి. కానీ, ఇప్పటి వరకూ అది జరగలేదు. ఎందుకంటే, రెఫరెండం నిర్వహిస్తే జరిగేదేంటో ఇస్లామాబాద్‌కు తెలుసు కాబట్టి. ఇవన్నీ తెలిసి కూడా పాకిస్తాన్ ప్రజలను మభ్యపెట్టేందుకు మన కశ్మీర్‌పై తీర్మానాలతో టైం వేస్ట్ చేస్తోంది. పాకిస్తాన్‌కు బుద్ధి రావాలంటే పీవోకేను సైనిక చర్యతో భారత్‌లో విలీనం చేయాలి. అప్పుడుకానీ ఇస్లామాబాద్ దారికిరాదు.

## మార్కాపురంను...

అభిప్రాయపడ్డారు. మిమ్మల్ని కళ్లెదుట చూసుకుంటే మాట్లాడుతుంటే అనుబంధం పెరుగుతుందని అన్నారు. క్షేత్రస్థాయిలో కొందరు టీడీపీ నేతలు వైసీపీ వాళ్లతో లాలూచీ పడినట్టు తనకు తెలిసిందని, ఇలాంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని హెచ్చరించారు. తాను ఈ మాట చెబితే... వైసీపీ వాళ్లు గింజుకుంటున్నారని... ఏం, మా వాళ్లు మీతో లాలూచీ పడాలా? అని ప్రశ్నించారు. ప్రాణాలు పోగొట్టుకున్న కార్యకర్తలకు కాకుండా మీకు పనులు చేయాలా మేము? అంటూ నిలదీశారు.

ఆడబిడ్డలు అభివృద్ధిలో భాగస్వామ్యం కాకపోతే చులకనగా చూసే అవకాశం ఉంటుందని.. ఆర్థికంగా సమాజంలో పైకి వచ్చేందుకు, ఆడబిడ్డల గౌరవం పెంచేందుకు డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలతో సీఎం మాట్లాడుతూ.. పొదుపు ఉద్యమంతో ప్రారంభించానన్నారు. గతంలో ఎన్నో మీటింగ్ పెట్టి మహిళలతో మాట్లాడేవాడినని చెప్పారు. పొదుపు వల్ల మహిళలు.. తమ పిల్లలను చదివించుకుంటున్నారని, చిన్న వ్యాపారాలు పెట్టుకుంటున్నారన్నారు. మహిళల గౌరవం పెరిగిందన్నారు. ఇంట్లో వారు మహిళలను గౌరవిస్తున్నారంటే ఆనాడు తాను ఆలోచించిన విధానమే కారణమన్నారు. మహిళలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తానన్నారు. మహిళలు తమ ఊర్లోనే కూర్చుని డబ్బులు సంపాదించే విధానానికి శ్రీకారం చుడతానన్నారు. డ్వాక్రా సంఘాలు, మెప్మా సంఘాల వారికి మెరుగైన జీవన ప్రమాణాలు ఇచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. అందుకు మహిళలు సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఆడబిడ్డల కష్టం తీర్చేందుకు దీపం పథకం తీసుకొచ్చామన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తామన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత తమదన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్**

'నా కుటుంబంతో పాటు వ్యాపారంలో భువనేశ్వరి పాత్ర కీలకం. హెరిటేజ్ సంస్థ ని భువనేశ్వరి డెవలప్ చేశారు. నా తల్లి పడిన ఇబ్బందులు మహిళలు పడకూడదనే దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశా. ఆడబిడ్డల భద్రత కోసం ప్రత్యేకంగా యాప్ తీసుకువచ్చాం. ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్. అదే మీకు చివరి రోజు అవుతుంది. గంజాయి, డ్రగ్స్ తాగి ఆడబిడ్డల జోలికి వస్తే వదిలిపెట్టం. గత ఐదేళ్లు మహిళలు స్వేచ్ఛగా మాట్లాడిన పరిస్థితి లేదు. మహిళలను బలవంతంగా మీటింగ్‌కు తీసుకువచ్చి బయటకు వెళ్ళకుండా చుట్టూ గుంటలు తీసేవాళ్ళు. మహిళలు ఇంటి నుంచి పని చేసేందుకు గ్రామాల్లో వర్క్ స్టేషన్లు పెడతాం. కంపెనీలు తీసుకువచ్చే బాధ్యత నాది... పని చేసే విధానం మీది' అని చెప్పుకొచ్చారు.

**అప్పుడు వద్దన్నాను.. ఇప్పుడు కనండి..**


చైనా, జపాన్‌లో జనం సంఖ్య తగ్గిపోతోందని.. సంపాదించింది అనుభవించడానికి కూడా వారసులు లేకుండా పోతున్నారన్నారు. గతంలో ఒక్కరినే కనమని చెప్పానని.. ఇప్పుడు వీలైనంత ఎక్కువ మందిని కనమని చెబుతున్నానని తెలిపారు. గతంలో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అవకాశం లేకుండా చట్టం చేశామని.. ఇప్పుడు ఇద్దరి కంటే తక్కువ ఉంటే పోటీ చేసే అవకాశం లేకుండా చట్టం తీసుకురావాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. తల్లికి వందననం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 15000 ఇస్తామన్నారు. ఐదు మంది పిల్లలు ఉన్నా.. 60వేలు ఇస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఎన్ని సార్లు అయినా మెటర్నిటీ సెలవులు ఇస్తానన్నారు. విజన్ 20-20 ఇచ్చి హైదరాబాద్ డెవలప్ చేశామని తెలిపారు. 2047కు ప్రపంచంలో అగ్ర దేశంగా భారత దేశం ఉంటుందని తెలిపారు. రతన్ టాటా ఛైర్మన్ అయిన తరువాత టాటా కంపెనీని ఆకాశానికి తీసుకెళ్లారన్నారు. రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెడుతున్నామని చెప్పారు. ప్రతి ఇంట్లో ఒక అంట్రప్రీమియర్ ఉండాలన్నారు. మహిళల కోసం 45 శాతం పెట్టుబడి రాయితీ ఇస్తున్నామని చెప్పారు. అబ్దుల్ కలాం కష్టపడి చదువుకుని దేశానికి రాష్ట్రపతి అయ్యారన్నారు. ప్రజల కోసం వాట్సాప్ గవర్నర్ తీసుకువచ్చామని తెలిపారు. ఏ పని కావాలన్నా వాట్సప్ గవర్నర్‌లో అయిపోయిందని అన్నారు. వాట్సాప్ ద్వారా 200 సర్వీసులు ఆన్‌లైన్‌లో పెట్టామని... రాబోయే రోజుల్లో వెయ్యి సర్వీసులు పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మార్కాపురంలో. 14,705 స్వయం సహాయక సంఘాలకు రూ.1,826.43 కోట్లు రుణాలను సీఎం పంపిణీ చేశారు. స్త్రీ నిధి రుణాలు పంపిణీ కోసం వెయ్యి కోట్లు చెక్ అందజేశారు. ఆపై 100 మంది మహిళల విజయ గాధ పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ చేశారు. మహిళల కోసం పోలీస్ శాఖ రూపొందించిన శక్తి యాప్‌ను ప్రారంభించారు. చేనేత రథం, ఈ-వ్యాపారి పోర్టల్ డెలివరీని మొదలుపెట్టారు. మార్కాపురంలో మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం చంద్రబాబు పరిశీలించారు.

## మహిళా దినోత్సవం ప్రతిరోజూ...

అన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అడ్వాంటేజ్‌గా పని చేస్తున్నారని తెలిపారు. టాటా పవర్‌తో 7 గిగా వాట్స్ ఒప్పందం జరిగిందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌కు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో తెలుగును ప్రమోట్ చేస్తున్నామని.. స్థానిక భాష తెలుగు అని ఉద్ఘాటించారు. భాషను బలవంతంగా రుద్దుతారని తాను నమ్మనని చప్పారు. వివిధ భాషలు నేర్చుకోవడం అవసరమన్నారు. ఏపీలో రెడ్ బుక్ మెయింటైయిన్ చేస్తున్నామని అన్నారు. వైసీపీ పాలనలో ఇసుక అక్రమ మైనింగ్ జరిగింది, సుప్రీంకోర్టులో కేసు కూడా నడుస్తుందని తెలిపారు. ఎన్డీఏకు తాము భేషరతుగా మద్దతు ఇస్తున్నామని ఉద్ఘాటించారు.హెచ్ ఆర్డీ శాఖ కావాలని తాను ఎంచుకున్నానని, దానిలో బలమైన టీచర్స్ యూనియన్లు ఉన్నాయని గుర్తుచేశారు. తన భార్య తన క్రెడిట్ కార్డు బిల్లు పే చేస్తుందని చెప్పారు. మహిళా దినోత్సవం ఒక్క రోజు మాత్రమే కాదు ...ప్రతిరోజూ జరుపుకోవాలని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడంతో హైదరాబాద్‌లో 45000 మంది ఐటీ ఉద్యోగులు చంద్రబాబుకు మద్దతు తెలిపారని గుర్తుచేశారు. ఛాంపియన్ ట్రోఫీ ఫైనల్ ఇండియా గెలుస్తుందని మంత్రి నారా లోకేష్ ఆశాభవం వ్యక్తం చేశారు. శాసనసభలో ప్రతిపక్ష హోదా ఉండాలంటే మొత్తం సభ సంఖ్యాబలంలో పదిశాతం ఉండాలని అన్నారు.చట్టాన్ని గౌరవించే వ్యక్తిని తానని చెప్పారు. పార్లమెంట్, శాసనసభలో ఉండే నిబంధనలను తాము ఎలా ఉల్లంఘిస్తామని ప్రశ్నించారు. ప్రపంచ భాషలు నేర్చుకోవడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. జర్మనీ, జపాన్ భాషలను నర్సింగ్ వృత్తిలో ఉండే వారికి నేర్పిస్తున్నామని. దాని ద్వారా వారికి ఆదేశాల్లో అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పిల్లలకు ఏది ఇష్టమో అది నేర్చుకునే అవకాశాలు ఇవ్వాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధులు 23 మందికి చెక్కులు...
## పంపిణీ చేసిన శాసనసభ్యులు నల్లారి.

పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 08: అన్నమయ్య జిల్లా పీలేరు కలికిరి ప్రాణాపాయం, అనారోగ్యం ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకున్న 23 మందికి చెక్కులు పంపిణీ చేసిన,తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి. శనివారం నగిరిపల్లిలో పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, గుర్రం కొండ, కలకడ మండలాలకు చెందిన బాధితులకు సీఎం సహాయనిధి కింద రూ. 31.లక్షల 24.వేల 570 వచ్చిన చెక్కులు పంపిణీ చేశారు.ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో బడుగు బలహీన వర్గాలకు పూర్తి భరోసా కల్పిస్తూ, ప్రాణాపా య స్థితిలో ఉన్న నిరుపేదలకు, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సహాయ నిధి కింద చికిత్స కొరకు తగిన ఆర్థిక సహాయం అందజేసి ఆదుకుంటున్నారని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరు పేదలకు ఆర్థికంగా ఆదుకుంటూ ప్రాణాలు కాపాడుతున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.



## బొజ్జలపై నిందలేస్తే యుద్ధం తప్పదు

శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 08: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవనంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిపై శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి నాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పలువురు టీడీపీ నాయకులు తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. శ్రీకాళహస్తి చెరువులు, గుంటలు ఆక్రమించిన సంస్కృతి నీది. ఎస్సీ, ఎస్టీల భూములు దోచుకున్నావు. నీ బినామీ ఓటేరు భూములు. నీ దగ్గర స్వచ్ఛమైన రికార్డులుంటే భయం ఎందుకు. రాజ్యాంగ బద్ధంగా శాసనసభ్యుడిగా ఎన్నికైన బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తన దృష్టికి రైతులు తీసుకొచ్చిన ఓటేరు చెరువు ఆక్రమణపై రక్షించాలనే అసెంబ్లీలో ప్రస్తావించారు. ఎవరి పేరు ప్రస్తావించ లేదు. ప్రెస్ మీట్లు పెట్టి చేయని తప్పులు చేసినట్లు చూపే ప్రయత్నంలో నిందలేస్తూ బ్లాక్ మెయిల్ రాజకీయాలు. ప్రతిపక్షం లేని నాయకుడిగా ఉంటూ వస్తూ ప్రతి ఐదేళ్లకు ఏ పార్టీలో ఎప్పుడు ఉంటాడో తెలియని మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి నాయుడు తెలుగుదేశం పుట్టుక నుంచి ఉన్నతికి పాటుపడినట్లు చెప్పడం హాస్యాస్పదం. నీతినిజాయితో అభివృద్ధికి మారుపేరుగా నలభై సంవత్సరాల రాజకీయ జీవితంలో తెలుగుదేశం పార్టీలో మచ్చలేని బొజ్జల కుటుంబం పార్టీ శ్రేణులకు అండగా ఉంది. ఏ రోజూ నీ అనుచరులకు తప్ప పార్టీ కార్యకర్తలకు మేలు చేయని నీ రాజకీయ జీవితం మొత్తం అవినీతి . స్వార్థపూరితమంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ నీతి నిజాయితీకి బొజ్జల కుటుంబం మారు పేరు అంటూ పెట్టిన ప్రెస్ మీట్లలోనే ప్రస్తావించి అదే ప్రెస్ మీట్లో ఆ కుటుంబ సభ్యులపై నిందమోపే ప్రయత్నం చేయడంలోనే మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి నాయుడు నిజస్వరూపం తేలిపోయిందన్నారు. మళ్లీ టీడీపీని వీడే సమయంలో కూడా నారా చంద్రబాబుపై విమర్శలు చేసి వైసీపీలోకి అడుగుపెట్టారని తెలిపారు. అయినా క్షమించి మళ్లీ టీడీపీకి వస్తానంటే చంద్రబాబు ఆహ్వానించారని చెప్పారు. ఆ సమయంలో షరతులు లేకుండా పార్టీలోకి రావాలని చెబితే అంగీకరించి ఆఖరి సమయంలో టిక్కెట్టు కావాలని వర్గాన్ని కుడగట్టిన విషయం అందరికీ తెలుసునన్నారు. శ్రీకాళహస్తిలో ఏనుగులగుంట వద్దనున్న ఎస్టీల భూములు ఆక్రమించిన విషయాన్ని లేవనెత్తారు. అలాగే పలు చెరువులు, గుంటలు బినామీలతో మింగేశారని ఆరోపించారు. అయినా ఏ రోజూ నాడు స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కక్షసాధింపు చర్యలు చేయలేదనే విషయాన్ని గుర్తెరగాలని సూచించారు. ఇది మరచిపోయి గోపాలన్న కుమారుడు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అభివృద్ధిలో దూసుకుపోతూ కనీవినీ ఎరుగనిరీతిలో శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను జనరంజకంగా నిర్వహించి ప్రజాభిమానాన్ని చురుగొనడంతో జీర్ణించుకోలేక అవాకులు చావాకులు పేలుతున్నారని ఎద్దేవా చేశారు. స్థాయికి దిగజారి సలహాలు తీసుకునేదాక పరిస్థితి తెచ్చుకోవద్దని సునితంగా హెచ్చరించారు. అభివృద్దే అజెండాగా ముందుకు వెళుతున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తొమ్మిది నెలల పాలనపై వంద పేజీలలో ఒక్కపేజీనే చదివానని మిగిలిన పేజీలు వారం వారం చదువుతానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్సీవీ పేజీల పుస్తకం విప్పితే ఆయన అడ్రస్సు గల్లంతు అవుతుందని స్పష్టం చేశారు. రాజకీయాలతో ఉనికిని కోల్పోకుండా హుందా రాజకీయాలు చేయాలని హితవు పలికారు. ఇప్పటికీ పార్టీలో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఎస్సీవీపై గౌరవం ఉందని బొజ్జల కుటుంబంపై నిందారోపణలు చేస్తే యుద్ధం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, పాల సొసైటీ మాజీ చైర్మన్ రావిళ్ల మునిరాజా నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, గాలి చలపతి నాయుడు,శ్రీకాళహస్తి మండల పార్టీ అధ్యక్షులు కామేష్ యాదవ్, ఈశ్వర్ రెడ్డి,మిన్నల్ రవి,పేట బాలాజీ, నాగరాజు నాయుడు,కాసారం రమేష్,గాలి మురళి నాయుడు, బత్తి రెడ్డి, బుజ్జి నాయుడు, మునస్వామి నాయుడు, ప్రతాప్ రెడ్డి,చిన్న రెడ్డి,బాబు నాయుడు,తిరుపతి పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు సుబ్బయ్య, ఎస్సీ సెల్ నాయకులు గాదిపాకుల గోపి, అశ్వార్థమ, షాకీర్ అలీ, దుర్గా, వినయ్,కృష్ణ యాదవ్, రాజా, చరణ్, సుబ్రహ్మణ్యం నాయుడు, సుమతి, మల్లీశ్వరి, రేణుకమ్మ, కుమారి, సుప్రజ, రమాదేవి, అనూష, ప్రతాప్, శోభన్, మునిరజా యాదవ్, రామచంద్రయ్య,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్లలో మహిళల భద్రతకు...

విధించేలా చట్టాలను సవరించామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని నవసారిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, మహిళల నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని అన్నారు. అమ్మాయిలు ఆలస్యంగా ఇంటికి వస్తే తల్లిదండ్రులు ప్రశ్నిస్తుంటారని, కానీ అబ్బాయిల విషయంలోనూ అలాగే ప్రశ్నించాలని వ్యాఖ్యానించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యతను ఇచ్చి, నిబంధనలు, చట్టాలను మార్చామని నరేంద్ర మోదీ అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు మరింత సాధికారత కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశ ఆత్మ గ్రామీణ ప్రాంతాల్లో ఉందని గాంధీ చెప్పారని, మహిళలు మన గ్రామీణ ప్రాంతాలకు ఆత్మగా భావిస్తున్నానని అన్నారు. ముస్లిం మహిళల జీవితాలను నిలబెట్టేందుకు ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా చట్టం తీసుకువచ్చామని గుర్తు చేశారు. మహిళల సారథ్యంలో ఎన్నో సంస్థలు విజయవంతంగా నడుస్తున్నాయని ఆయన అన్నారు. కోట్లాది మంది తల్లులు, సోదరీమణుల ఆశీర్వాదం కలిగిన తాను ప్రపంచంలోనే అత్యంత ధనికుడినని వ్యాఖ్యానించారు.

## మహిళలు అత్యవసర పరిస్థితిలో...

వినియోగించుకోవాలని సూచించారు. మహిళల భద్రతకు సంబంధించి శాంతి భద్రతల విషయంలో రాజీ పడేది లేదు.... మీ వెంటే మేముంటాం అంటూ మంత్రి భరోసా ఇచ్చారు. "వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి రాష్ట్రంలో కోటి మందికి పైగా మహిళలకు దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇస్తాం. ఇప్పటికే 96.40 లక్షల మంది మహిళలకు ఉచిత గ్యాస్ అందిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో నాణ్యమైన బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నాం. పార్లమెంట్ లో ప్రవేశపెట్టబోయే మహిళల అక్రమ రవాణా నిరోధక బిల్లుకు పూర్తిగా మద్దతిస్తాం. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతోపాటు మహిళలలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం" అని నాదెండ్ల వివరించారు. కాగా, ఈ కార్యక్రమంలో తొలుత రూ.131.82 కోట్ల చెక్కును మంత్రి డ్వాక్రా సంఘాల మహిళలకు అందజేశారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి), నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రయోజనాల కోసం...

తెలంగాణ ఎంపీల సమావేశం జరుగుతోంది. ఈ సమావేశానికి మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా హాజరయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు గైర్హాజరయ్యారు. కేంద్రం వద్ద పెండింగులో ఉన్న బిల్లులపై ఈ సమావేశంలో చర్చించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌ని భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే ఖరారైన కార్యక్రమాలు ఉండటంతో తాము రాలేమని కిషన్ రెడ్డి లేఖ ద్వారా సమాచారం ఇచ్చారు. మల్లు భట్టి విక్రమార్క ఎంపీలందరికీ నిన్ననే ఆహ్వానం పంపించారు.

## మహిళా సాధికారత పేరుతో...

మీడియాతో షర్మిల మాట్లాడారు. స్త్రీ లేకపోతే జననం లేదు... గమనం లేదు. అసలు సృష్టే లేదని ఉద్ఘాటించారు. తల్లిగా, సోదరిగా, భార్యగా, కూతురుగా జీవితంలోని ప్రతి దశలోనూ మగవాడిని నడిపించేది మహిళ అని కొనియాడారు. స్త్రీ ఎక్కడ గౌరవం పొందుతుందో ఆ ఇల్లు, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. ఇవాళ దేశంలో, రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని విమర్శించారు. మహిళలు అంటే బీజేపీకి కనీస గౌరవం లేదని వైఎస్ షర్మిలా రెడ్డి మండిపడ్డారు. ఓటు బ్యాంక్ కోసం మహిళలను సెకండ్ క్లాస్ సిటిజన్ కింద బీజేపీ లెక్కగట్టిందని వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. వికసిత భారత్‌లో గంటకు 50 మంది మహిళలపై భౌతిక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు 80 మంది మహిళలపై లైంగిక వేధింపులు జరగడం అత్యంత శోచనీయమని వాపోయారు. పేరుకే నారీశక్తి వందన్ ... కానీ ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని చెప్పారు. మహిళలను వేధించిన చరిత్ర బీజేపీ, దాని అనుబంధ సంఘాలదని ధ్వజమెత్తారు. మహిళల భద్రతపై ఎన్ని ఫాస్టాక్ చట్టాలు. ఉన్నా... ఆచరణలో మహిళలకు న్యాయం శూన్యమని చెప్పారు. ఇటు రాష్ట్రంలో సైతం మహిళలకు గౌరవం లేదని వైఎస్ షర్మిలా రెడ్డి మండిపడ్డారు. గడిచిన పదేళ్లలో 2 లక్షల మంది మహిళలపై వేధింపుల కేసులు నమోదయ్యాయని వైఎస్ షర్మిలా రెడ్డి గుర్తుచేశారు. గత ఐదేళ్లలో 25 శాతం అఘాయిత్యాలు పెరిగాయన్నారు. 54 వేల మంది మహిళల మిస్సింగ్ కేసులు నమోదు కావడం అత్యంత దారుణమన్నారు. మహిళలపై దాడుల్లో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా ఉండటం సిగ్గుచేటుని అన్నారు. హింసకు కారణం అవుతున్న మద్యం, మత్తు పదార్థాలు అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఫైర్ అయ్యారు. మరోవైపు మహిళా సాధికారత అంటూ చేస్తున్నది కూడా మోసమేనని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు , నెలకు రూ.15 వందల ఆర్థిక సహాయం, సున్నా వడ్డీకే రుణాలు, తల్లికి వందనం కింద ఏడాదికి రూ.15 వేలు లాంటి పథకాలు ఇస్తామని.. మహిళలకు టోకరా పెట్టారు తప్పిస్తే ఉద్ధరించింది శూన్యమని వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు.

## జగన్ ప్రభుత్వం ఖజానా...

ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్క హామీని అమలు చేస్తూ వస్తున్నామని అన్నారు. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహిళలకు త్వరలోనే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రారంభిస్తామని చెప్పారు. తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15వేల చొప్పున తల్లుల ఖాతాల్లో మే లోగా జమ చేస్తామని మంత్రి నారాయణ అన్నారు.

## అదానీ, అంబానీలతో పోటీపడేలా...



విశ్వవిద్యాలయాలతో పోటీ పడాలని ఆకాంక్షించారు. మహిళలకు అవకాశం లభిస్తే వారు తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, స్వయం సహాయక సంఘాల ద్వారా 100 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి సోలార్ విద్యుత్ సరఫరా చేసే విధంగా మహిళా సంఘాలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు.

## ప్రజా సేవలకు విశిష్ట పురస్కారం



**బుచ్చినాయుడు కండ్రిగ,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 08:** బుచ్చి నాయుడు కండ్రిగ తలారివెట్టు పంచాయతీ కామన్ సర్వీస్ సెంటర్ లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న పక్యాల విక్రమ్ కు జిల్లా బెస్ట్ విలేజ్ లెవల్ ఎంటర్ ఫైనర్ గా ప్రోత్సాహక బహుమతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ చేతుల మీదుగా ప్రధానం చేయగా..ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ యశ్వంత్ తిరుపతి జిల్లా మేనేజర్ సతీష్, అభినందనలు తెలుపుతూ మరింతగా ప్రజలకు సేవలు అందించి అందుబాటులో ఉండాలని అభినందనలు తెలియజేశారు. ఈ కార్య క్రమం లో తోటి వి. ఎల్.వి లు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో ఘనంగా అంతర్జాతీయ... మహిళా దినోత్సవ వేడుకలు

### వేడుకల్లో పాల్గొన్న షార్ మహిళా శాస్త్రవేత్తలు

**శ్రీసిటీ,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 08:** వివిధ రంగాల్లో మహిళల ప్రాధాన్య తను గుర్తిస్తూ శ్రీసిటీ స్థానిక పరిశ్ర మలు శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నాయి. షార్ మహిళా శాస్త్రవేత్తలు, శ్రీసిటీ మహిళా ఉద్యోగులు ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని “యాక్షన్‌ను వేగవంతం చేయండి” అనే థీమ్‌తో జరుపుకుంటున్నారు. మహిళల పురోగతిని వేగవంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా వ్యూహాలు, వనరులు, కార్యకలాపాలను గుర్తించి, వాటి అమలుకు మద్దతు ఇవ్వడంతో పాటు మహిళలు సమాజంలో అన్ని రంగాలలో సమాన అవకాశాలు పొందాలన్న లక్ష్య సాధనకు సంబంధించిన కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడం ఈ థీమ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ దృక్పథాన్ని ఇప్పటికే సాకారం చేస్తూ, శ్రీసిటీలోని బలమైన మహిళా శ్రామికశక్తి సమాన అవకాశాలతో ప్రగతి దిశగా పయనిస్తోంది.శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకలను శ్రీమతి మమతా సన్నారెడ్డి, తిరుపతి ఏఎస్పీ బిహెచ్ విమలకుమారి, సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ సీనియర్ సైంటిస్ట్ వి.లత ప్రారంభించారు. అతిథులకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ డైరెక్టర్ ( సి ఎస్ ఆర్) నిరీషా సన్నారెడ్డి, శ్రీసిటీ విజయంలో మహిళా ఉద్యోగుల కీలక పాత్రను ప్రస్తావించారు. సమ్మిళిత, వివక్షత లేని, ఉద్యోగి కేంద్రీకృత విధానాలు కలిగిన శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, మహిళలకు అనుకూల ప్రగతిశీల పని వాతావరణాన్ని పెంపొందించిందని ఆమె పేర్కొన్నారు. ‘ఈ కార్యక్రమానికి హాజరైన మహిళా ఉద్యోగులను ఉద్దేశించి విమలకుమారి, లత, మమతా సన్నారెడ్డి ప్రసంగిస్తూ, ఇటీవలి కాలంలో వివిధ రంగాలలో స్త్రీల పాత్ర, ప్రభావం పెరుగుతోందని చెబుతూ, పలు అనుభవాలను పంచుకున్నారు. శ్రామికశక్తిలో మహిళల కీలక పాత్రను ప్రస్తావిస్తూ, శ్రీసిటీ తయారీ పరిశ్రమలలో వీరిని ప్రోత్సహించేందుకు చేస్తున్న ప్రయత్నాలను కొనియాడారు. శ్రీసిటీ పరిశ్రమల్లో స్త్రీ, పురుషులకు కల్పిస్తున్నసమాన అవకాశాలపై స్పందిస్తూ, గతంతో పోల్చితే ప్రస్తుతం పారిశ్రామికరంగంలో విశేష మార్పులు చోటుచేసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతంలో పుష్కలమైన జీవనోపాధి అవకాశాలను కల్పించి, తమ ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి వారు ప్రత్యేక కృత్ఞతలు తెలిపారు.వేడుకల్లో భాగంగా షార్ మహిళా శాస్త్రవేత్తలు శ్రీసిటీ పరిసరాలలో పర్యటించి పారిశ్రామిక ప్రగతిని పరిశీలించారు. స్థానిక హావెల్స్, పెప్సికో పరిశ్రమలను సందర్శించి, పారిశ్రామిక కార్యకలాపాలను వీక్షించారు. పరిశ్రమల శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం, పని సంస్కృతి, మహిళా సాధికారతను ప్రోత్సహించే పర్యావరణ వ్యవస్థను శాస్త్రవేత్తలు ప్రశంసించారు. ఇంకా డైకిన్ ఇండియా, బ్లూస్టార్, హావెల్స్, మోండెలెజ్, వెస్ట్ ఫార్మా, పెప్సికో పరిశ్రమలలో మహిళా దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.



# మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

### ప్రతిరోజు మహిళా దినోత్సవం గా జరుపుకోవాలి – ప్రతి మహిళ ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలి...
### సమాజ వికాసానికి, సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
### ఆడపిల్ల పుడితే భాధ పడే స్థాయి నుంచి గర్వించే స్థాయికి వచ్చాం: నగర మేయర్
### మహిళలు మనోధైర్యంతో బతకాలి...కనికరంతో కాదు
### ప్రపంచం యావత్తూ మహిళల మీద ఆధారపడి ఉంది : పూతల పట్టు శాసనసభ్యులు
### మహిళలు ప్రతి పనిని సంకల్పంతో చేయడం వల్ల ముందంజలో ఉంటాం: చుడా చైర్ పర్సన్



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ,మార్చి 8:** మహిళా దినోత్సవం రోజే కాకుండా ప్రతిరోజు మహిళా దినోత్సవంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు.శనివారంచిత్తూరు నాగయ్య కళాక్షేత్రం నందు ఐ సి డి ఎస్ డి ఆర్ డి ఏ, మెప్మా ,జిల్లా మహిళా సమాఖ్య సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ... మహిళలందరూ ప్రతి రోజున మహిళా దినోత్సవం గా జరుపుకు నే విధంగా గౌరవంగా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని తెలిపారు.ప్రతి పురుషుడు మహిళల పట్ల గౌరవంతో మెలగాలని, మహిళా సాధికారతకు తోడ్పడాలని తెలిపారు. ప్రతి రోజు మహిళలు వారు చేసే పనిలో వారికి అవకాశం ఉన్నంత వరకు ఒంటరి మహిళలకు సాయం చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. సమాజ వికాసానికి సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు.నగర మేయర్ అముద మాట్లాడుతూ...ఆడపిల్లలు పుడితే భాధ పడే స్థాయి నుంచి ఆడపిల్లలు పుడితే గర్వించే స్థాయికి వచ్చామని, ప్రతి స్త్రీ తమ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకు నేందుకు కృషి చేయాలని తెలిపారు. పూతల పట్టు శాసనసభ్యులు కె.మురళీ మోహన్ మాట్లాడుతూ... మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలను తెలిపారు. ఈ ప్రపంచం యావత్తూ మహిళల మీద ఆధారపడి, మహిళల చేత నిర్మించబడి, మహిళల వలన అభివృద్ధి చెందుతుందని, ప్రతి కుటుంబంలో మహిళ ప్రత్యేక పాత్ర పోషిస్తుందనన్నారు.ఇంటి ప్రగతి,అభివృద్ధి, సంక్షేమం వంటివి మహిళల పైనే ఆధార పడి ఉంటుందని తెలిపారు. మహిళలు మనోధైర్యంతో బతకాలని కనికరంతో కాదని, ఆనాడు గౌరవ స్వర్గీయ నంద మూరి తారక రామారావు గారు మహిళల కు పురుషులతో పాటు సమానంగా ఆస్తి హక్కు కల్పించారనన్నారు. మన రాష్ట్రం లో మహిళల ప్రగతికి మార్పు ప్రథమంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి తో మొదలైందని, మహిళా దినోత్సవం రోజే కాకుండా ప్రతిరోజు మహిళలు గౌర వింపబడాలని తెలిపారు.గౌ.రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, మహిళల అభివృద్ధికి కృషి చేసే నాయ కుడు మన ముఖ్యమంత్రి గారనన్నారు. చుడా చైర్మన్ కటారి హేమలత మాట్లాడు తూ... ప్రతి స్త్రీ మనకు మనం గౌరవించు కుంటూ ప్రతి పనిని సంకల్పంతో చేయడం వల్ల ముందంజలో ఉంటామని, మహిళ లంటే బహుగుణ ప్రతిభ కలిగినవారని, ఎటువంటి విషయం అయినా పలు కోణా లలో ఆలోచించి సమస్యలను పరిష్కరించ గలుగుతారని,మహిళలకు విద్య,ఉద్యోగం, భద్రత కల్పించడం గౌరవ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు గారి ధ్యేయమని, రాబోయే రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉంటారని, ప్రతి ప్రతి పురుషుడికి మహిళ ఒక తల్లిగా, ఒక చెల్లిగా, ఒక భార్యగా, ఒక అక్కగా ప్రత్యేక స్థానంలో ఉంటుందని తెలిపారు.జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి మాట్లాడు తూ...అందరికీ మహిళా దినోత్సవ శుభా కాంక్షలు తెలియజేస్తూ... స్త్రీ లేకపోతే జననం లేదు, స్త్రీ లేకపోతే సృష్టి లేదని, ప్రస్తుతం మహిళలు అభివృద్ధి పదంలో ముందుకు వెళ్లేందుకు చాలా కష్టపడుతు న్నారని, ఇలాగే ప్రతి ఒక్క మహిళ ఆత్మ విశ్వాసం, మనోధర్యం తో కష్టపడుతూ ముందుకు సాగాలని తెలిపారు.డి సి హెచ్ ఎస్ వరలక్ష్మి మాట్లాడుతూ... పూర్వం మహిళలు కొంతవరకు చదువుకొని ఇంట్లో ఉంటే చాలనే రోజుల నుంచి ప్రస్తుతం అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అభివృద్ధిలో ముందున్నారని, మహిళలు చదువులో రాణించాలని, బాగా చదువు కోవడం వల్ల ఏ రంగంలో అయినా ముందు అడుగులో ఉంటారని విన్నవించారు. డి ఎం హెచ్ ఓ సుధారాణి మాట్లాడుతూ.... ఆడపిల్లలకు వారి తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే ఆత్మరక్షణ చేసుకునే విధంగా మార్షల్‌ఆర్ట్స్ వంటి శిక్షణలు నేర్పించాలని, ఆడ, మగ అనే లింగవివక్షత తేడా లేకుండా తల్లిదండ్రులు పెంచాలని తెలిపారు. టి డి పి రాష్ట్ర మహిళా విభాగం వైస్ చైర్మన్ వై వి రాజేశ్వరి మాట్లాడుతూ... మహిళ




లేనిదే జననం లేదని, జననం లేనిదే సృష్టి లేదని, ఆనాడు పార్వతీ పరమేశ్వరులు, సీతారాములు వంటి పేర్లలో మొదటిగా స్త్రీ ని గుర్తించడం జరిగిందని, అలాంటి గుర్తింపు ఉన్న మహిళలకు మన రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పదంలో ముందడుగు వేసేలా చర్యలు తీసుకుంటుంద న్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం లో నగర మేయర్,చుడా చైర్మన్ మరియు మహిళా జిల్లా అధికారులైన డిఆర్డిఏ ఐసిడిఎస్ పిడి లు శ్రీదేవి, వెంకటేశ్వరి, డిఎం %డ% హెచ్ ఓ డాక్టర్ సుధారాణి డి సి హెచ్ ఎస్ డాక్టరు ప్రభావతి, డి డి ఐ ఎన్ పి ఆర్ పద్మజ లను సన్మానించారు. అనం తరం డిఆర్డిఏ, ఐసిడిఎస్, మెప్మా, జిల్లా మహిళా సమాఖ్య లలో ఉత్తమ పని తీరు కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా డి ఆర్ డి ఏ ద్వారా 576 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రూ.97 కోట్ల 72 లక్షలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా 3740 మంది పట్టణ స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ. 28.93 కోట్లు చెందిన మెగా చెక్కును జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలోమెప్మా పీడీ రవీంద్ర బాబు, సమగ్ర శిక్ష ఏపిసి వెంకటరమణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, సంబంధిత శాఖల అధికారులు పెద్ద ఎత్తున స్వయం సహాయక సంఘ మహిళలు పాల్గొన్నారు.

## ప్రపంచంలో మహిళా శక్తిని ఎవరూ ఆపలేరు

### పి ఈ ఎస్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మోహన రూప

**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మర్చి08:** ప్రపంచంలో మహిళా శక్తిని ఎవరు ఆపలేరని మెడికల్ కళాశాల ప్రొఫెసర్ మోహన రూపా అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మోహన రూప మాట్లాడుతూ ప్రధానంగా లింగ వివక్షతను తగ్గించేందుకు, మహిళా సాధికారితను పెంపొందించేందుకు పురుషలతో సమానంగా అవకాశాలు కల్పించేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటామని పేర్కొన్నారు. బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బీసీ నాగరాజు మాట్లాడుతూ కార్మిక ఉద్యమాల ఫలితంగా మహిళా దినోత్సవం ఏర్పడిందని వివరించారు. విదేశాలలో ప్రారంభమైన ఈ మహిళా దినోత్సవం 1977లో మార్చి 8న అంతర్జాతీయ మహిళా హక్కుల దినోత్సవం గా పరిగణించారని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజు మాట్లాడుతూ మహిళల ఆర్థిక సామాజిక రాజకీయ విజయాలను గుర్తించడమే కాకుండా వారి స్థాయిని పెంచే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, ఆర్ అండ్ డి డైరెక్టర్ కోదండరామయ్య, పిఆర్ఓ ప్రవీణ్ కుమార్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీధర్ బాబుకి బెస్ట్ నంది జాతీయ అవార్డ్..




**ఎస్ఆర్ పురం,చిత్తూరు** ఎక్స్ ప్రెస్, మార్చి 08: మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా కాణిపాకం వద్ద ఘనంగా మహిళ దినోత్సవం నిర్వహించారు మహిళా దినం సందర్భంగా శ్రీధర్ బాబు కి ఉత్తమ జాతీయ గోల్డ్ నంది అవార్డు ను మనం ఫౌండేషన్ అధినేత అడ్వకేట్ చక్రవర్తి ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు సుజాత తులసి ప్రీతి శ్రీవిద్య శకుంతల ఝాన్సీ లక్ష్మి వీరికి కూడా మనం ఫౌండేషన్ నేషనల్ అవార్డ్ ఇవ్వడం జరిగింది.

# మహిళలు మరింత చైతన్యవంతులై ముందుకు సాగాలి

### ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని విజయం సాధించాలి – ప్రతి ఇంటికో మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలి
### ప్రభుత్వ పథకాలలో మహిళలకు పెద్ద పీట- ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం నెరవేరుస్తుంది
### మహిళా దినోత్సవ కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి – రూ.10.58 కోట్ల చెక్కు పంపిణీ

**పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి08:** మహిళలు మరింత చైతన్యవంతులు గా రాణించాలని పలమనేరు శాసన సభ్యులు అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయం లో మెప్మా ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మహిళలను ఉద్దేశించి ప్రసంగించా రు. మొట్ట మొదట మహిళలందరికీ అంతర్జా తీయ మహిళా దినోత్సవ శుభాకాం క్షలను తెలియజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడు తూ...మహిళ లు ఆర్థికంగా రాజకీ యంగా ఎదగడానికి నాడు బీజం వేసింది స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీనేన న్నారు.మహిళలను ఆర్థికంగా రాణిం చడానికి దేశంలోనే డ్వాక్రా సంఘాల ను ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమని, మహిళలకు రాజకీయ హక్కు కల్పించి 33% రిజర్వేషన్ ద్వారా స్థానిక సంస్థలందు అవకాశం కల్పించిన ఘనత కూడా టీడీపీదేన న్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వడా నికి మహిళల వెంట నేడు క్యూ కడు తున్నాయంటే అందుకు మీరు కల్పిం చుకున్న నమ్మకమే కారణమని అన్నారు. మహిళలు వంటింటిలో పడుతున్న బాధలు చూసి వారికి దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చి ఆదుకున్న నాయకుడు చంద్ర బాబు అని ఇప్పుడు దీపం-2 ద్వారా మూడు సిలిండర్లు సంవత్సరానికి ఉచితంగా ఇస్తున్నది తెలుగుదేశం ప్రభుత్వమే అని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి, %ూా××జ% ద్వారా భూమిని సగం ధరకే ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని మహిళలు తమ స్వశక్తితో రాణించడానికి టైలరింగ్ లో ఉచిత శిక్షణ ఇస్తూ,వారికి ఉచితంగా కుట్టు మిషన్లు ఇస్తూ అండగా ఈ ప్రభుత్వం నిలుస్తోందన్నారు.ప్రతి ఇంటిలో ఒక మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలని సరళమైన విధానా లతో అన్ని రకాల ప్రోత్సాహకాలు, సబ్సిడీ రుణాలను ప్రభుత్వం అంది స్తోందని, తల్లికి వందనం పేరుతో ప్రతిబిడ్డకు చదువుకోవడానికి 15000/- రూపాయలు త్వరలో చెల్లిస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాలన్నీ మహిళలకు అందేలా తెలుగుదేశం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇలా అన్ని ప్రభుత్వ పథకాలల్లో మహిళ లకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అన్ని అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు ఆర్థికంగా,సామాజికంగా, రాజకీయంగా రాణించాలని కోరారు. అనంతరం పట్టణ




స్వయం సహాయక సంఘులకు రూ. 10.58 కోట్ల మెగా చెక్ ను అందజేశారు. తదనంతరం పలువురు వివిధ రంగాలల్లో రాణిం చిన మహిళలను ఆయన సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో పలమనేరు బాలాజీ కో ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ,మున్సిపల్ కమిషనర్ రమణా రెడ్డి, మెప్మా మేనేజర్ బాబా లతో పాటు కౌన్సిలర్లు సునీతా నాగరాజు,కిరణ్,బీ ఆర్ సీ కుమార్ మరియు టీడీపీ నాయకులు ఆర్ బి సి కుట్టి,గిరిబాబు, ఖాజాపీర్,చాంద్ భాషా,మదన్,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమమే... తెలుగుదేశం పార్టీ లక్ష్యం..

### ఎమ్మెల్యే డాక్టర్ ఆదేశాలతో వికలాంగురాలు వనజ కి ద్విచక్ర వాహనాన్ని పంపిణీ

**గంగాధర్ నెల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 08:** మహిళా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ముఖ్య ఉద్దేశం అని యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ అన్నారు శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ ఆదేశాల మేరకు నెల్లేపల్లి పంచాయతీ కోత్తూరు గ్రామానికి చెందిన వనజ అనే వికలాంగురాలు కు ద్విచక్ర వాహనాన్ని ఉచితంగా శ్రీధర్ యాదవ్ అందించారు.. వనజ పుట్టుకతోనే వికలాంగురాలు ఆమె పట్టు వదలకుండా టీచర్ ట్రైనింగ్ చేసింది అలాగే తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలకు చురుగ్గా పాల్గొనేది తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసింది ఆమె సేవలను గుర్తించి నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెకు ద్విచక్ర వాహనాన్ని డాక్టర్ ఎమ్మెల్యే థామస్ ఆదేశాలతో శ్రీధర్ యాదవ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు.



## స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు



**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 08:** కుప్పం నియోజకవర్గంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారా భువనేశ్వరి మేడం ఏర్పాటుచేసిన స్కిల్ సెంటర్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అక్కడున్న మహిళలందరూ టైలరింగ్, జ్యూట్ బ్యాగ్స్, ఎంబ్రాయిడింగ్ మరియు సిల్క్ థ్రెడ్ బ్యాంగిల్స్ లాంటి వివిధ రకాల కోర్సులను ప్రవేశపెట్టి స్వయం ఉపాధి కింద తమకు ఇలాంటి అవకాశం కల్పించిన నారా భువనేశ్వరి మేడం కి మహిళలందరూ కృతజ్ఞతలు తెలుపుకుంటూ నారా భువనేశ్వరి మేడం కి కుప్పం మహిళల తరపున మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## వి కోటలో వైభవంగా మహిళా దినోత్సవం...



**వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 08:** ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా వీకోటాలోని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పిఎన్ లక్ష్మి ను మండలంలోని సాటి మహిళలు మరియు తమ కోడలు కలిసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి ఆమెను దుశ్యాలవలు పూల మాలలతో ఘనంగా సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలతో పాటు వివిధ పార్టీ మహిళలు కూడా పిఎన్ లక్ష్మీ కు శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్లు పంచి పెట్టినారు.

## జల్లికట్టు కార్యక్రమానికి విరాళం అందించిన టిడిపి నాయకులు



**వెదురు కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి08:**
వెదురు కుప్పం మండలం కొమరగుంట గ్రామంలో మార్చి 10వ తేది నుండి 17వ తేది వరకు శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మార్చి 16వ తేదీ జరగబోవు జల్లికట్టు కార్యక్రమానికి 50000/- రూపాయలను విరాళంగా అందించిన టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి ఎన్ ముని చంద్రా రెడ్డి మరియు ఇన్నాం కొత్తూరు గ్రామ కమిటి అధ్యక్షులు పి.ధర్మా రెడ్డి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్లస్టర్ ఇంచార్జి కోనేరు చెంగల రాయ రెడ్డి, ఇన్నాం కొత్తూరు మాజీ సర్పంచ్ పి.డిల్లి రెడ్డి, కొమర గుంట గ్రామ కమిటి అధ్యక్షులు పి.మోహన్ రెడ్డి, కొమరగుంట సర్పంచ్ సురేష్, సీనియర్ నాయకులు హనుమంతు శెట్టి, డీలర్ కృష్ణయ్య శెట్టి, టిడిపి యువ నాయకులు లోకేష్, మహేష్, అతేష్, సుధాకర్ ,కేశవుల్ రెడ్డి, నవీన్, నరేష్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు తమ విధులలో గొప్పగా రాణిసూ... ఆదర్శంగా నిలవాలి

### పలమనేరు సీఐ నరసింహ రాజు



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 08:** మహిళలు తమ విధులలో గొప్పగా రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని పలమనేరు సి ఐ నరసింహ రాజు అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సంద్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ఎస్సై నుండి హెూమ్ గార్డ్ అధికారి వరకు మహిళ అధికారులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలు బయటకు రాని కాలంలో రుద్రమ దేవి లాంటి వారు రాజ్యాలను పాలించారని, సరోజని దేవి లాంటి వారు స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని, మహిళలకు రాజకీయాలు అంటే తెలియని కాలంలో ఇందిరా గాంధీ గారు దేశాన్ని పాలించారని , జిల్లాకు సైతం కలెక్టర్,ఎస్పి గా వచ్చిన మహిళ అధికారులు మహిళలందరికీ ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. ఇప్పుడున్న మహిళ అధికారులు గ్రామీణ ప్రాంతం నుండి ఏంతో కష్టపడి ఈ స్థాయి వరకు వచ్చారని ఎందరో మహిళలకు రోల్ మోడల్ గా నిలుస్తున్నారు అని అన్నారు. ప్రతి మహిళ కూడా తమ కాళ్ళ మీద తాము నిలబడుతూ ఇంట బయట చక్కగా రాణించగలగాలని, మహిళలు ఎందులోనూ తక్కువ కాదని అన్నారు. పోలీస్ స్టేషన్ అంటే ఇప్పటికి చాలా మంది మహిళలు బయపడుతారని ఆ భయాన్ని తొలగించాలని , ప్రజలలో పోలీస్ పై మరింత నమ్మకాన్ని కల్గించాలని తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పలువురికి ఆదర్శంగా నిలవాలని సి ఐ సుచించారు.

## పీఈఎస్ గ్రూప్ వ్యవస్థాపకుడు డా. ఎం.ఆర్. దొరస్వామి నాయుడు స్మారకార్థం పీఈఎస్ మెడికల్ కాలేజీలో సంతాప సమావేశం





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 08:** 2025: పీఈఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూ షన్స్ స్థాపకుడు డా. ఎం.ఆర్. దొరస్వామి నాయుడు స్మారకార్థం, పీఈఎస్ మెడికల్ కాలేజీ కుప్పంలో సంతాప సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పీఈఎస్ మెడికల్ కాలేజీ అధ్యాపకులు,సిబ్బంది మరియు విద్యార్థులు హాజరై, డా. దొరస్వామి నాయుడు విద్యా రంగానికి చేసిన విశేష సేవలను, వీరి అసమాన కృషిని మరియు విశిష్ట దృక్పథాన్ని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పీఈఎస్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మరియు డీన్ డా.హెచ్.ఆర్. కృష్ణ రావు మాట్లాడుతూ... డా. ఎం.ఆర్. దొరస్వామి నాయుడు ధ్యేయం, పట్టుదల కృషి వల్లే పీఈఎస్ గ్రూప్ దేశంలోనే ప్రఖ్యాత విద్యా సంస్థగా ఎదిగింది అని పేర్కొన్నారు. విద్యలో నాణ్యత, పరిశోధన మరియు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఆయన చూపిన దారి అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.సంతాప కార్యక్రమంలో పీఈఎస్ మెడికల్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు, సిబంది మాట్లాడుతూ, డా.ఎం.ఆర్.దొరస్వామి నాయుడు అద్భుత నాయకత్వాన్ని, విద్యాపరమైన సంస్కరణలను, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధి పట్ల ఉన్న ఆయన అంకితభావాన్ని గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా అందరూ నిశ్శబ్దంగా ఒక నిమిషం మౌనం పాటించి,ఆయనకు

## స్వయం ఉపాధి శిక్షణ తరగతి భావనము ను ప్రారంభించిన... శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి





**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 08:**
శ్రీకాళహస్తి జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా కమ్యూనిటీ భవనము , స్వయం ఉపాధి శిక్షణ తరగతి భావనము ను ప్రారంభించిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి. బొజ్జల సుధీర్ రెడ్డి సన్మానించి ఆహ్వానం పలికిన రాస్ సంస్థ సభ్యులు . ఈ సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న అనేక కార్యక్రమాలను చూసి చాలా సంతోషంగా ఉందని, నిరుపేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్న రాస్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా నన్ను ఆహ్వానించిన రాస్ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ,మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో రాస్ సంస్థ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం



**బుచ్చినాయుడు కండ్రిగ,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 08:** బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ప్రజా ప్రగతి ట్రస్ట్ చెంచులక్ష్మి మ్యాక్స్ ఆఫీస్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బుచ్చినాయుడు కండ్రిగ ఎస్సై విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలియజేయడం జరిగింది,అలాగే అడ్వకేట్ పుష్ప లత , మాట్లాడుతూ మహిళలు అభ్యున్నతికి రాజ్యాంగం లో చాలా చట్టాలు చేయడం జరిగిందని మహిళలు ఓర్పుతో నేర్పుతో పిల్లలను బాగా చదివించి పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకు రావాలని దేశానికి మార్గదర్శకంగా తయారు కావాలని తెలియజేయడం జరిగింది. తర్వాత విద్యాశాఖ నుండి జై శ్రీ మేడం , మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా చూడాలని పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని తెలియజేయడం జరిగింది తర్వాత ప్రజా ప్రగతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజాప్రగతి ట్రస్ట్ 1983 వ సంవత్సరం నుండి మహిళలకు జీవనోపాది కల్పించడం విద్య, వ్యవసాయానికి సంబందించిన కార్యక్రమాలలో తమ వంతు కృషి చేస్తున్నామని తెలియజేయడం జరిగినది. తర్వాత చెంచులక్ష్మి మ్యాక్స్ అధ్యక్షురాలు అనితాలక్ష్మీ మాట్లాడుతూ చెంచులక్ష్మి మ్యాక్స్ ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటం కోసం లోన్స్ ఇస్తున్నామని వీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆర్థిక అభివృద్ధి చెందాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళా సంఘం సభ్యులు అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజా ప్రగతి ట్రస్ట్ సిబ్బంది హాజరు కావడం జరిగింది.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి08:** అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పుర స్కరించుకొని, పలమనేరు గంగమ్మ గుడి వీధిలో గల,శ్రీవెంకటే శ్వర ఆర్యవైశ్యకళ్యా ణ మండపం నందు, వాసవి వనితాక్లబ్ వారిచే మహిళా దినోత్సవ నిర్వహణ. వాసవి వనిత క్లబ్ పలమనేరులో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ... ఉంటుం ది. ఈరోజు మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకొని, పలమనేరులోని, అన్ని రంగాల లో విశిష్ట సేవలు అందించిన,అందిస్తున్న, మహిళా మణులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్య క్రమంలో, గృహి ణులతో పాటు, వివిధ రకాల ఉద్యోగ బాధ్యతలు నిర్వహి స్తున్న,నలుగురు మహిళలకు సన్మానం చేయడం జరిగింది. ఎన్నో గవర్నమెంట్ హాస్పిటల్స్ లో డాక్టర్ గా, సూపరిండెంట్ గా బాధ్యతలు నిర్వ హించి, గైనకాలజీ విభాగం లో తనదైన ముద్ర వేసిన వీణా కుమారి గారిని, పలమ నేర్ ఏరియా హాస్పిటల్ చిన్నపిల్లల డాక్టర్ , సూపరిండెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తు న్న కే మమతా రాణి గారిని,వందనా మేడం అంటే తెలియని వారు ఉండరంటే అతిశ యోక్తి కాదు యూనివర్సల్ స్కూల్లో 25 సంవత్సరాలుగా టీచర్గా బాధ్యతలు నిర్వ హిస్తూ... సాయం కాలం పూట ట్యూషన్ నిర్వహిస్తూ... వేల విద్యార్థులను తీర్చిది ద్దిన వంద నా మేడం గారిని, పలమనేర్ శివాలయం ఈవో కమలాకర్ గారి సతీ మణి ,గృహిణి లీలావతి గారిని, పలమ నేరు వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు రమ్య హరీష్ మరియు సెక్రెటరీ విజయ ప్రసాద్ ట్రెజరర్ లక్ష్మీరాజు, ఆర్ మాధవి బాలాజీ గారు కార్యక్రమాన్ని నిర్వహించ గా ..అతిథులకు షాలువ కప్పి మెమెంటో ఇచ్చి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో, వనితలకు అగ్ని తో పని లేకుండా, పౌష్టికాహారాన్ని అత్యం త రుచిగా తయారు చేసిన రేవంత్ బద్రి గారికి మొదటి బహుమతి.ప్రేమా కుందా నం రెండవ బహుమతి, శ్వేత కుందానం మూడో బహుమతి సాధించగా.... వారికి క్లబ్ సభ్యులచే బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో,అతిథులు మహిళా దినోత్సవ వైశిష్ట్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా వాసవి వనిత క్లబ్ వారిచే నిర్వహించబడింది ఈ కార్యక్రమం లో,వనితా క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



## ట్రాఫిక్ సమస్య లేకుండా... చూడాలి : ఎంపీపీ



**వెదురు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మర్చి 08:** వెదురు కుప్పం మండలం లోని పచ్చి కాపల్లం,చవట గుంట, దేవళంపేట లలో జరిగే వారపు సంత సమయం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని పోలీసులు స్పందించి రైతులకు, కొనుగోలుదారులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ బండి నాగ హేమ సుందర్ రెడ్డి సూచించారు.

## ఆధునిక విధానాలతో... అధిక దిగుబడులు సాధించాలి

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
ఉద్యాన రైతులకు పరికరాలను పంపిణి చేసిన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి08:** యాంత్రీకరణ ద్వారా ఆధునిక సాగు విధానంతో రైతులు అధిక దిగుబడులు సాధించాలని పలమనేరు ఎమ్మెల్యే అమర నాథ రెడ్డి సూచించారు.పలమనేరు మండ లంలోని ఆర్డిఓ ఆఫీసులో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి లో స్థిరమైన దిగు బడులు సాధించడా నికి ఆచరించవలసిన యాజమాన్య పద్ధతులు ,చిత్తూరుజిల్లాలో మామిడికి ప్రత్యామ్నాయంగా లాభ దాయ కంగా సాగు చేయదగిన పంట లపై కుప్పం మరియు పలమనేరు నియోజకవర్గంలోని రైతు సేవ కేంద్ర సిబ్బందికి శిక్షణ కార్య క్రమం నిర్వహిం చడం జరిగింది.ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజర య్యారు. ఈ సందర్భంగా పలమనేరు నియోజకవర్గం లోని 82 మంది రైతులకు 80 హెక్టార్ల విస్తీర్ణానికి సంబంధించి ఒక కోటి రూపాయలు విలువ గల సూక్ష్మ సేద్య పరికరాలను ఐదు ఎకరాల లోపు సన్న, చిన్న కారు రైతులకు 90% రాయితీ ,ఐదు ఎకరాలు పైబడిన రైతులకు 70 శాతం రాయితీతో అందజేయడం జరిగింది. అదేవిధంగా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో 50% రాయితీతో ఉద్యాన పంటలలో అంతర సేద్యానికి ఉపయోగపడే పవర్ టిల్లర్ లను, మామిడికాయల నాణ్యతను పెంచడానికి ఉపయోగపడే మామిడి కవర్ల ను రైతులకు 50 శాతం రాయితీపై అంద జేశారు. ఈ ప్రాంత రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలనాన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్విని యోగం చేసుకొని అధికారుల సూచనలతో మంచి పంటల సాగు చేపట్టాలన్నారు. ఇంత పెద్ద ఎత్తున రైతులకు డ్రిప్పు పరిక రాలను అందజేయడం చాలా మంచి విష యమని పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్య క్రమంలో పూర్ణ దత్తారెడ్డి శాస్త్రవేత్త ఉద్యాన పరిశోధనా స్థానం మదనపల్లి మరియు పీరు సాహెబ్ కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి మామిడి పంటలో నల్ల తామరపురు గుల యాజమాన్యంపై వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి డి. మధుసూదన్ రెడ్డి,సూక్ష్మ సేద్య ప్రాజెక్ట్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం,ఉద్యాన సహా య సంచాలకులు కోటేశ్వరరావు లతో పాటు టీడీపీ నాయకులు అర్వీ.బాలాజీ, మాజీ ఏ ఎం సి చైర్మన్ రామచంద్ర నాయు డు,కిషోర్ గౌడ,రంగనాథ్,నాగరాజ రెడ్డి, జగదీష్ నాయుడు, రాంబాబు, సుబ్రమ ణ్యం శెట్టి,శ్రీరాములు,ప్రసాద్ నాయుడు, మురహర రెడ్డి, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు హాజరయ్యారు.

## షీ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ... మహిళా దినోత్సవ వేడుకలు.

**పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 08:** చిత్తూరు జిల్లా పీలేరు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రకాల సంస్థల నుండి ప్రతిభా వంతులను గుర్తిస్తూ షీ సంస్థ సన్మా నాలను చేయడం జరుగుతుందని షి సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి వి ఎస్ లక్ష్మి,సలహాదారు.డాక్టర్ రాయల సుధాకర్ తెలియజేశారు. మహిళ లేనిదే మనుగడ లేదు యాత్ర నారియస్తు పూజ్యంతే రమ్మంటే తత్ర దేవత ఎక్కడ మహిళలు పూజించ బడతారో అక్కడ దేవతలు కొలువు ఉంటారని వేదాలలో చెప్పబడింది దీనిని దృష్టిలో ఉంచుకొని షి సంస్థ అన్ని రంగాల్లో తమ ముద్రను వేస్తూ రాణిస్తూ తమ శక్తిని కుటుంబానికి సమాజ శ్రేయస్సుకు ధారబోస్తూ ప్రత్యేకంగా నిలు స్తున్న మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సన్మాన కార్యక్ర మం నిర్వహించడం జరిగింది. కార్యక్రమం లో భాగంగా వివిధ రంగాలలో పనిచేస్తున్న మహిళలను గుర్తిస్తూ పంచాయతీ డిపా ర్టుమెంట్ నుండి పారిశుద్ధ కార్మికులను పాఠ శాలల్లోని ఆయమ్మలను ఆసుపత్రుల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మహిళలను సన్మానించడం జరుగుతుందని తెలియ జేశారు. తమ ఆరోగ్యాన్ని ఫలితం పణంగా పెట్టి ప్రత్యేక సేవల ను అందిస్తూ అందరికీ ఆరోగ్యాన్ని పంచుతున్న అతిబలను గుర్తించి సన్మానం చేపట్టడం జరిగిందని షి సంస్థ నిర్వాహకులు తెలియజేశారు సంస్థ ద్వారా మీరందరినీ గుర్తించి తమ వంతు బాధ్యతగా అటవీలకు ఆత్మీయంగా గౌర వించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో గుప్తా హాస్పిటల్ శ్రీభువన విద్యాలయం సిద్ధార్థ విద్యాసంస్థల నుండి, పంచాయతీ పారిశుద్ధ కార్మికులు పాల్గొని విజయవం తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా యోగ శ్రీఅవార్డ్స్ ను మాజీ ఎమ్మెల్యే శ్రీ నాథ్ రెడ్డి రాకేష్ ,వారి అబ్బాయికి యోగ శ్రీ అవార్డును అందజేశారు.



OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036